# ఫలించని స్వప్నాలు — కె. చంద్రమోహన్

రాజు మనసులో సుధరూపం మెదిలింది 'గుడ్‌గర్ల్' అనుకున్నాడు ఎప్పుడూ నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూంటుంది. ఒక్కసారి బాగా ఏడిపించాలి.

ఆలోచన వచ్చిందే తడవుగా టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి డైల్ చేశాడు

"హలో ఎవరూ మాట్లాడేది?" అవతల్నించి సుధ పలికింది.

"నేను రాజును," జవాబిచ్చాడు

"ఓ నువ్వా, రాజూ! ఏమిటి సంగతి?"

"ఏంలేదు సుధా! యివ్వాళ్ళ 'కమల్' థియేటర్లో కొత్త హిందీ సినీమా, వెళ్దామా?"

"నీమాట ఎప్పుడైనా కాదన్నానా రాజూ!"

"అయితే సరిగ్గా అయిదున్నరకి హాల్‌దగ్గర రెడీగా ఉండాలి."

"ఓకే"

రిసీవర్ రెస్టుమీదుంచివచ్చి కుర్చీలో వాలాడు.

పిచ్చిసుధ తను నిజంగా సినీమాకి వస్తాననుకొని సరిగ్గా అయిదున్నరకే హాలుకి వచ్చేస్తుంది. తను వెళ్ళడు అసలే కొత్తపిక్చర్‌కదా రాజొచ్చేసరికి టిక్కెట్లు ఉంటాయో లేవో అని రెండు టిక్కెట్లు తీసేస్తుంది థియేటర్లో బెల్ మ్రోగుతుంది. సుధ విసుగుతో వాచీ చూసుకుంటుంది. ఇటూ అటూ తిరుగుతుంది. చూపంతా గేటుమీదే ఉంటుంది 'ఛి ఛీ, ఏం మగాళ్ళు' అని విసుక్కుంటుంది. ఇంకా ఏవేవో తిట్టుకుంటుంది. అప్పుడు చూడాలి ఆమె వదనం ఎక్కడలేని విసుగూ, కోపం ఆమెనే ఆకట్టుకుంటాయి అలాంటి పరిస్థితుల్లో ఆమెను చూసితీరాలి ఎక్కడనుంచైనా కనిపెట్టాలి

* * *

'రాజుని ఏడిపిస్తే!' సరిగ్గా అదే ఆలోచన సుధలో మెదిలింది. సాయంత్రం సినీమాకి వెళ్ళడం మానేస్తే! పాపం, రాజు కరెక్టుగా అయిదున్నరకి హాలుకి వస్తాడు క్యూలో నిలబడి చమట్లు కక్కుకుని టిక్కెట్లు తీస్తాడు. బ్రతుకు




జీవుడా అనుకుంటూ క్యూలోంచి బయట పడ్తాడు. థియేటర్లో ఫస్ట్‌బెల్ మ్రోగుతుంది. ఇంకా రాలేదేవిటి అనుకుంటాడు. ఇటూ అటూ పచార్లు చేస్తాడు. సెకండ్ బెల్, లాస్ట్‌బెల్ కూడా అయిపోతాయి. నోట్లో ఉన్న సిగరెట్ కసిదీరా నేలకేసి కొడ్తాడు గేటునుంచి హాల్లోకి, హాలునుంచి గేటుదగ్గిరికి ఇటూ అటూ తనకోసం తెగతిరుగుతాడు. ఆ క్షణంలో అతని ముఖం చూడాలి. తనెక్కడైనా కనిపిస్తే మింగేద్దామన్నట్టుంటుంది. ఆ పరిస్థితిలో అతన్ని చూడాలి. అతనికి కనిపించకుండా ఎక్కడనుంచైనా కనిపెట్టాలి.

* * *

సాయంత్రం అయిదున్నరయింది. 'కమల్' థియేటర్ ఎదురుగా ఉన్న పార్కులో జనం పల్చగా ఉన్నారు. అప్పుడే రాజు పార్కులో ప్రవేశించాడు. చుట్టూ చూశాడు - థియేటర్ ఆవరణ ఎక్కడినుంచి చూస్తే క్లియర్‌గా కనిపిస్తుందా అని. మెయిన్ గేటు పక్కనున్న గోడ అతనికి నచ్చింది. అక్కడికి నడిచాడు. ఎవరో ఒక స్త్రీ బైనాక్యులర్స్‌లోంచి తదేకంగా థియేటర్లోకి చూస్తోంది. బైనాక్యులర్స్ అడిగి, అందులోంచి సుధని చూడాలనిపించింది. ఆమెని పిల్చాడు. "చూడండి మిస్..." ఆ స్త్రీ ప్రక్కకు తిరిగింది. అంతే! ఒకళ్ళకీ మాట పెగల్లేదు. ఒకరినొకరు వింతగా చూసుకున్నారు. తనని తాను సంబాళించుకొని అన్నదిసుధ. "పిక్చర్‌కేనా పోదామా?"

"ఆఁ ఆఁ, పోదాం."

ఇంకేం అనలేకపోయాడు రాజు ఇద్దరూ థియేటర్‌వైపు నడిచారు.